క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

శావల్యాపురం: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గల్లా రవికృష్ణ తెలిపారు. శావల్యాపురం జాతీయ రహదారిపై సోమవారం జెడ్పీ హైస్కూలు, పెట్రోలు బంకు సమీపాన డ్రమ్ములను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అత్యధిక బరువు కలిగిన డమ్ములను ప్రత్యేకంగా తయారు చేయించి వాటికి రేడియం స్టిక్కర్లు అంటించటం ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రణ చేయనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు కానిస్టేబుల్స్ అంజి, ఆదినారాయణ, గంగిరెడ్డి ఉన్నారు.

తెలుగు ఉపాధ్యాయురాలు హిమబిందుకు డాక్టరేట్



చిలకలూరిపేట: పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయురాలు ప్రత్తిపాటి హిమబిందు నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. సెయింట్ చార్లెస్ స్కూలులో పనిచేస్తున్న ఆమె కవి, సాహితీవేత్త 'దావులూరి వీరభద్రరావు సాహిత్యం- పరిశీలన' అనే అంశంపై ఆంధ్ర లయోలా కళాశాల విశ్రాంత ఉప ప్రధానాచార్యులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ లభించింది.

కృష్ణయ్య మాస్టారు మృతి



వినుకొండ (నూజెండ్ల) : వినుకొండ పుర ప్రముఖుడు, విశ్రాంత తెలుగు పండిట్ సీవీ కృష్ణయ్య (72) సోమవారం మృతి చెందారు. గుండెపోటు రావడంతో గుంటూరులోని రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. గతంలో స్థానిక లయోలా హైస్కూలులో తెలుగు పండితుడిగా ఆయన పని చేశారు. పట్టణ ప్రజలందరికీ ఆయన సుపరిచితుడు. పలు రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, ఆయన శిష్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

మోడల్ స్కూలుకు ప్రొజెక్టర్, పుస్తకాల బహూకరణ



బొల్లాపల్లి: స్థానిక ఏపీ మోడల్ స్కూలుకు సోమవారం డిజిటల్ ప్రొజెక్టర్, స్క్రీన్, లైబ్రరీ బుక్స్, వాటర్ ప్యూరిఫైయర్‌ను మూగచింతలపాలెం గ్రామానికి చెందిన ఎస్‌వీ చారిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు పోక వెంకట్రావు మాట్లాడుతూ ఇంటర్‌లో జిల్లా ప్రథమ ర్యాంక్ సాధించిన చైతన్య అనే విద్యార్థిని సివిల్స్ సర్వీసెస్ పూర్తయ్యే వరకు ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారు. మూగచింతలపాలెం, ఎస్సీ గంగినేని కాలనీ, ఎస్సీ రైస్ మిల్ కాలనీ, గంగులపాలెం ప్రాథమిక పాఠశాలల్లోని మొత్తం 156 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, జామెంట్రీ బాక్స్, పెన్నులు, పలకలు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి అమెరికాలో నివసిస్తున్న పట్టణ వాసి కరణం రాజా రూ.75వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ కార్యాలయంలో చెక్‌ను సోమవారం ఈవో వేమూరి గోపీకి అందించారు.

వర్సిటీ జట్టుకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాల్ బాడ్మింటన్ జట్టుకు ఎంపికైనట్టు ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మనోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ధనిరెడ్డి రాణి, బీరం చిన్నమ్మాయి, ఉన్నగిరి అఖిల ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని బి.ఎస్. అబ్దుల్ రెహమాన్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో వర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. విద్యార్థినుల్ని కళాశాల కార్యదర్శి ఎం.ఆర్. శేషగిరిరావు, అధ్యాపకులు అభినందించారు.

నేతాజీకి ఘన నివాళి

నరసరావుపేట ఈస్ట్: నేతాజీ జయంతి వేడుకల్ని సోమవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశభక్తి, క్రమశిక్షణకు నేతాజీ నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఆర్.కె.సతీష్ బాబు, అధ్యాపకులు బ్రహ్మానందరెడ్డి, ఎం.బాల కోటేశ్వరావు. కె.శ్రీదేవి పాల్గొన్నారు.

నాదెండ్లలో..

గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నేతాజీని జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం టి. సత్యనారాయణ పాల్గొన్నారు. గణపవరం రాజీవ్ గాంధీ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అవనిగడ్డ యల్లమందయ్య, హుస్సేనమ్మ చారిటబుల్ ట్రస్ట్, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి హెచ్ఎం ఎ. గురులింగం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

లోకేష్ పాదయాత్ర ఆపాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు

- ఆయన ఎన్ని రోజులు తిరిగితే ప్రభుత్వానికి అంత మంచిది
- తొమ్మిదో వార్డు గడప గడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



వార్డు ప్రజలకు సంక్షేమ పథకాల వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో నారా లోకేష్ చేసే పాదయాత్రను ఆపాలనే దురుద్దేశం ప్రభుత్వానికి లేదని, అయితే ఆపబోతున్నట్లుగా వారే తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. లోకేష్ ఎన్నిరోజులు పాదయాత్ర చేస్తే వైఎస్సార్ సీపీకి అంత మంచిదని పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం తొమ్మిదో వార్డు శ్రీనివాసనగర్‌లో ఆయన పర్యటించారు. వార్డు మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, కన్వీనర్లు గాలం కోటేశ్వరరావు, వెన్నపూస జోసెఫ్‌రెడ్డి, న్యాయవాది సింధుకూరి శ్రీనివాసరావు, షేక్ చాంద్ బాషా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లారు. ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలను గురించి తెలియజేస్తూ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. వారు చెబుతున్న సమస్యల్ని వింటూ మనోభావాల్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రను ప్రభుత్వం అడ్డుకోవట్లేదని, రోడ్లపైకి వచ్చిన సమయంలో ప్రజలకు ఇబ్బందిలేకుండా చూసే బాధ్యత ఉందని తెలిపారు. ఇటీవల ప్రజలు మరణించిన సంఘటనలు పునరావృతం గాకుండా ఇరుకైన రోడ్లలో సభలు పెట్టవద్దని మాత్రమే జీవోను తీసుకువచ్చినట్లు చెప్పారు. పాదయాత్ర ఆపే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. వార్డులోని శివారు ప్రాంతాల్ని విలీనం చేసి రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు రూ.3.37కోట్లతో అందజేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అప్పులు చేస్తుందన్న ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు మాటలకు ఆయన వివరణ ఇచ్చారు. దేశంలోని ఏ రాష్ట్రం అప్పులు చేయకుండా పని చేస్తుందని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లల్లో రూ.3లక్షల కోట్లు అప్పు చేసిందని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ప్రతి కుటుంబాన్ని ఆదుకునేందుకు వలంటీర్ల వ్యవస్థ ద్వారా కృషి చేసినట్లు చెప్పారు. వలంటీర్లు లేకపోతే రాష్ట్రంలో చాలామంది ఇబ్బంది పడేవారని, మరణించేవారని తెలిపారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు వెళుతున్నాయంటే అది వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలే కారణమని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి పాలపర్తి సామ్రాజ్యం, మాజీ కౌన్సిలర్లు యర్రంశెట్టి బాబ్జి, అబ్దుల్ సత్తార్, షేక్ మస్తాన్‌వలి, మాడిశెట్టి మోహనరావు, నాయకులు సయ్యద్ ఖాదర్ బాషా, షేక్ అలీమియా, షేక్ ఎస్.చినఖాజా, డి.శ్రీనివాసరెడ్డి, వివేకానందమూర్తి, రేపూడి కుమారి, బండి వెంకటేశ్వరరెడ్డి, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

చేతిరాత పోటీల్లో దొండపాడు పాఠశాల విద్యార్థినులకు బహుమతులు



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో జ్యోతికిరణ్

నరసరావుపేట రూరల్: నేషనల్ హ్యాండ్ రైటింగ్ డేను పురస్కరించుకుని ఈనెల 22వ తేదీ గుంటూరులో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థినులు బహుమతులు సాధించినట్లు దొండపాడు ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.కిరణ్ దాస్ తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రాథమిక స్థాయిలో పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థిని కుంభా అలేఖ్య ప్రియ, ప్రాథమికోన్నత స్థాయిలో ఆరో తరగతి విద్యార్థిని రెడ్డిబోయిన పూజిత ద్వితీయ బహుమతిలు సాధించినట్లు వివరించారు. విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయిని పి.పద్మను ఎంఈవో జ్యోతికిరణ్ అభినందించారు.

ముగిసిన కలశ మహోత్సవం

నాదెండ్ల: గణపవరంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న భద్రావతి సమేత భావనారుషి కలశ మహోత్సవ వేడుకలు సోమవారంతో ముగిశాయి. తొలిరోజు గురువారం కలశానికి శివాలయం వద్ద జలాభిషేకం నిర్వహించి అనంతరం సంప్రదాయ బద్ధ మేళతాళాలతో పద్మశాలీయ వీధిలో వేసిన చలువ పందిరిలో ప్రతిష్ఠించారు. పూజల అనంతరం ఆదివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు ముాకుళ్లలో ఒత్తులు వేసుకుని దీపారాధన చేశారు. ప్రధాన వీధుల్లో ప్రత్యేకంగా బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాలను గణపవరం పద్మశాలీయ సేవా సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా విఘ్నేశ్వరుని ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులోని శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్ని సోమవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పూజారి ఇర్లపాటి సురేష్ బృందం ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అలంకరణతో పాటు మండపారాధన, నవగ్రహ పూజలు, లక్ష్మీగణపతి హోమం, మహన్యాసక పూర్వక రుద్రాభిషేకం జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. లక్ష్మీగణపతి హోమంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ ఈవో తులసీదాస్, జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, చిలకలూరిపేట నరసింహస్వామి దేవస్థానం చైర్మన్ శివరామకృష్ణ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాటం

నరసరావుపేట ఈస్ట్: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతీ వరప్రసాద్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు సీపీఐ, ఏఐటీయూసీ చేపట్టిన రాష్ట్రవ్యాపిత రెండు రోజుల నిరసన దీక్ష కార్యక్రమంలో భాగంగా స్టేషన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్, ఉప్పలపాటి రంగయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు అనూష ఎంపిక



అనూషతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, పీడీ ఝాన్సీరాణి

నరసరావుపేట రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్–17 రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్టు లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.వి.ఎ.ఎల్. వరప్రసాద్ సోమవారం తెలిపారు. ముప్పాళ్ల మండలం బొల్లారంలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా టెన్నికాయిట్ పోటీల్లో పాఠశాలలో పదవ తరగతి చదవుతున్న పూజల అనూష ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు ఆయన పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా జి.కొండూరులో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర పోటీల్లో ఆమె జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా అనూషను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని జి.ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

5న తిరుపతమ్మ తల్లి, గోపయ్య కల్యాణం

రొంపిచర్ల: స్థానిక బొడ్రాయి సెంటర్‌లోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి ఆలయంలో సోమవారం కల్యాణ మహోత్సవ లగ్నపత్రికను ఆవిష్కరించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వచ్చే నెల 5న కల్యాణంతో పాటు భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు.

హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ

చిలకలూరిపేట: హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ లభిస్తుందని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టి.వి.నాగలక్ష్మి తెలిపారు. 34వ జాతీయ రహదారి వారోత్సవాల్లో భాగంగా సోమవారం హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం ప్రకారం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేనిపక్షంలో రూ. వెయ్యి జరిమానా విధిస్తామని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపేవారికి మొదటి తప్పుకు రూ. 15వందలు, రెండో తప్పుకు రూ. 10వేలు జరిమానా విధిస్తామని చెప్పారు. మద్యం తాగి వాహనం నడిపితే ఆరునెలలు జైలుశిక్ష పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంలో 33 బస్తాల దిగుబడి

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోవారం వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు చింతలపూడి నాసర్‌రెడ్డి పొలంలో ఏంటీయూ 1156 రకం ఎకరానికి 33 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు వ్యవసాయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇన్సూరెన్స్ అధికారి సీహెచ్. శ్రీను, వీఏఏలు పి.అశోక్, వి.రేవంత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వి.తిరుపతిరావు, రోశిరెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా రామాలయ నిర్మాణం



ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు, కమిటీ సభ్యులు

నాదెండ్ల: గణపవరం నడిబొడ్డున రూ.2 కోట్లతో శ్రీ రామాలయ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సోమవారం జీవ ధ్వజ స్తంభ తయారీ పనులు ప్రారంభమయ్యాయి. టేకు స్తంభానికి పూజల అనంతరం పనులు ప్రారంభించారు. వడ్రంగి లోకేష్ బృందం ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. మేలో విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, కలశ మహోత్సవం నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రతిష్ఠకు శ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి హాజరుకు తేదీలు ఖరారు కావాల్సి ఉందని వారు తెలిపారు.

బధిర పాఠశాలలో దుప్పట్ల పంపిణీ

వినుకొండ టౌన్: విఠంరాజుపల్లి గ్రామ శివారులోని సెయింట్ ఆన్స్ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సభ్యుల ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు ఆలా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రోటరీ జిల్లా 3150 గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు అండగా రోటరీ ఫౌండేషన్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ రమేష్‌బాబు, క్లబ్ కార్యదర్శి జి. నారాయణరావు, మాల్యాద్రి, ఎం. గిరి, బి. శ్రీనివాసరావు, రామన్, జి. గురునాథం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న వాసవీ క్లబ్స్ నాయకులు, సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్స్ నాయకులు, సభ్యులు అమ్మవారికి పట్టు చీర, పసుపుకుంకుమలు సమర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్స్ నాయకులు చిలంకూరి కోటేశ్వరరావు, పచ్చిపులుసు రామాంజనేయులు, బి.రవి, శారద, శివలక్ష్మి, కొత్తమాసు రమ, జీవీఎల్ నాగేశ్వరరావు, గజవల్లి పవన్, మండవ కిరణ్, కృష్ణ, అప్పలరాజా, జి.శ్రీనివాసరావు, పెండేల శ్రీనివాసరావు, ప్రసాద్, సురేష్, నాగయ్య, సాంబశివరావు, లక్ష్మీనారాయణ, భార్గవ్, వాసు, రవికుమార్, మహేశ్వరి, పావని పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలి: ఎంపీపీ

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బి. రాములు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పలు ప్రభుత్వ శాఖల పనితీరుపై చర్చించారు. రాబోవు వేసవి దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో సమస్యల్ని పరిష్కరించాలని నిర్ణయించారు. ప్రధానంగా బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యసేవలు సక్రమంగా లేవని సమావేశంలో సభ్యులు తెలిపారు. పాఠశాలల్లో ముఖ ఆధారిత హాజరు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు బోధన కుంటుపడుతోందని, పనితీరు సక్రమంగా లేదని వెల్లడించారు. మండలంలో చేపట్టిన పనులు, ప్రణాళికల్ని అధికారులు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా పనిచేయాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బి.మరియమ్మ, కోఆప్షన్ మెంబరు మౌలాలి, ఇంచార్జ్ ఎంపీడీవో టి.పార్వతి, పార్టీ నాయకులు పి.గురవయ్య, ఎం.రాజయ్య పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ నెల 26న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో ఎన్‌సీసీ కవాతులో పాల్గొననున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.ఆర్.కె. రాజు సోమవారం తెలిపారు. విద్యార్థులు కె.ఏడుకొండలు, జి.అశోక్‌లు 23 ఆంధ్రా బెటాలియన్ తరపున ఎన్‌సీసీ కవాతుకు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థుల్ని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె.విజయకుమార్, ఎన్.సుబ్బరాయగుప్త, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్. సుధీర్ అభినందించారు.

ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు : ప్రజల ఇంటి వద్దకే గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని తీసుకెళ్లి అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. మండలంలోని పెదకొండాయపాలెం, చినకొండాయపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కరోనా కష్టకాలంలో కూడా సీఎం తమను ఆదుకోవడం సంతోషంగా ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల వారికి సంక్షేమం అందిస్తూ, మరోక వైపు అభివృద్ధి కార్యక్రమాల్ని శరవేగంగా చేస్తుంటే ప్రతిపక్షానికి కనిపించడం లేదని విమర్శించారు. ఇప్పటికే మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 95శాతం పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన సారథ్యంలో వినుకొండ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుర్లపాటి చౌడయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కోపెల దేవరాజ్, గ్రామ సర్పంచ్ కేతినేని వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకటహనుమయ్య, జానయ్య, నన్నం సాంబయ్య, బొల్లా బుజ్జి, తహసీల్దార్ విజయజ్యోతికుమారి, ఎంపీడీవో ఉషాకిరణ్, ఏవో రామారావు, విద్యుత్ ఏఈ రఫీ పాల్గొన్నారు.

సర్వే పనుల ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): ఎన్నో సంవత్సరాలుగా భూములను అనుభవిస్తూ ఎటువంటి హక్కు పత్రాలు లేకుండా ఉన్న అగ్రహార భూములకు సర్వే చేయించి రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలంలోని గాంధీనగర్ గ్రామంలో అగ్రహార భూముల సర్వే కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, పార్టీ నేత జడ్డా రామయ్య, ఒంగూరి ప్రసాద్, ఎంపీడీవో జిలానీబాషా, తహసీల్దార్ మధుబాబు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఆక్రమణల చెర నుంచి భూములను విడిపించాలి

కలెక్టర్‌ను కోరిన యానాదులు

నరసరావుపేట: బొల్లాపల్లి మండలం కనుమల చెరువు పంచాయతీలో తమకు కేటాయించిన 600ఎకరాల భూమిని ఇప్పించాలని కోరుతూ 150 కుటుంబాలకు చెందిన యానాదులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. 1951లో తమను రెడ్డి యానాదులుగా పరిగణిస్తూ టెనెంట్ కో-ఆపరేటివ్ సొసైటీగా ఏర్పాటు చేసి సాగు చేసుకునేందుకు 600 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఇప్పుడా భూముల్ని సుగాలీలు, ఇతర కు టుంబాల వారు ఆక్రమించి పట్టాలు పుట్టించుకొని అనుభవిస్తున్నారని ఆరోపించారు. భూములు కావాలని కోరే తమపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తున్నారని వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు డి.రామకృష్ణ, నల్లపాటి రామారావు, షేక్ మస్తాన్‌వలి, తుపాకలు పులిరాజు, బొజ్జా సుందరరావు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సర్క్యులర్ మెమోలో అంశాలు రాజ్యాంగ విరుద్ధం

జిల్లా కలెక్టర్‌కు దళిత, క్రైస్తవ సంఘాల నాయకుల వినతి

నరసరావుపేట: ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు 1998లో విడుదల చేసిన సోషల్ వెల్ఫేర్ సర్క్యులర్ మెమోలో క్లాజ్–8 లోలని 3,4 పేరాలను తొలగించాలని దళిత సంఘాలు, క్రైస్తవ సంఘాలు, మానవ హక్కులు, మహిళా సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు బోరుగడ్డ అంబేడ్కర్ మాట్లాడుతూ బొమ్మలు, క్యాలెండర్‌లు, పేర్లు, ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు, పబ్బాలు ఇలాంటి వాటి ఆధారంగా మతాన్ని నిర్ణయించి షెడ్యూల్ కులాల ధ్రువీకరణ చేయమని సర్క్యులర్‌లో ఇవ్వడం అనైతికం, రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఇది షెడ్యూల్ కులాల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు కె.సురేష్, ప్రవీణ్ కుమార్, కె.జయరాజు, యం.ప్రకాష్, బి.అబ్రహం, బి.ఏసుపాదం, జి.శాంతరాజు, పి.జ్ఞాన ప్రకాశరావు, యం.నాగేశ్వరరావు, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

వినుకొండ (నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన మార్కాపురం రోడ్డులో పసుపులేరు వంతెనపై సోమవారం రాత్రి జరిగింది. సత్తెనపల్లి మండలం ఇరుకుపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కే.ఖాజా, మొగిలి చందు, యడవల్లి శ్రీనివాసులు ద్విచక్ర వాహనంపై శ్రీశైలం వెళుతూ వినుకొండలో అల్పాహారం చేశారు. అనంతరం అక్కడకు వెళుతుండగా మార్గంమధ్యలో పసుపులేటి వంతెనపై మూల మలుపులో బైకు అదుపుతప్పి రోడ్డుపై పడటంలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో ఏఎంజీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంజీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ మహంతి

చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు అథ్లెటిక్స్‌లో రాణించడం అభినందనీయమని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 20నుంచి 21వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి స్కూల్స్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏఎంజీ హైస్కూలు పదో తరగతి విద్యార్థులు 17 సంవత్సరాల బాలుర పోల్‌వాల్ట్ జంప్ ఈవెంట్‌లో టి. వీరవెంకటనారాయణ రజిత పతకం, బి. కల్యాణ్‌బాబు నాయక్ కాంస్య పతకం సాధించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు సోమవారం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం పి. మేరి, పీఈటీలు రాజు, రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శంకర మఠం పునఃప్రతిష్ట

వినుకొండ టౌన్: పట్టణంలోని ఇసుకవాగు బజార్, పాత శివాలయం వద్దనున్న శ్రీ శంకర మఠం పునఃప్రతిష్ట వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మఠం నిర్వాహకులు, వినుకొండ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొల్లిపల్లి భానుతేజ, చింతలచెరువు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. స్వామి పవళింపు సేవ, రుద్రాభిషేకం అనంతరం పూర్ణాహుతితో వేడుకలు ముగిశాయి.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com